క్లుప్తంగా

6.30లక్షల క్యూసెక్కులు విడుదల

జగ్గయ్యపేట: పులిచింతల ప్రాజెక్ట్ నుంచి 6.30 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తుండటంతో కృష్ణానది పరివాహక గ్రామాలైన ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాల్లో కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మృత్యకారులంతా పడవలను కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు.

మునేరుకు భారీగండి

పెనుగంచిప్రోలు: మునేరు ప్రధాన కాలువకు 36వ కిలోమీటరు వద్ద 100 అడుగుల మేర గండిపడింది. తువ్వకాలువకు తొమ్మిది చోట్ల గండ్లు పడినట్లు అధికారులు తెలిపారు. తోటచర్ల వద్ద వాగులో ట్రాక్టర్ కొట్టుకుపోగా, ప్రమాదంలో చిక్కుకున్న ట్రాక్టర్‌లోని ఇద్దరిని పోలీసులు, స్థానికులు తాడుసాయంతో కాపాడారు.

గ్రామాలకు రాకపోకలు బంద్

జగ్గయ్యపేట: పాలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బూదవాడ అన్నవరం గ్రామాల్లోని బ్రిడ్జిలపై వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో గ్రామాల్లోని పలు కాలనీలకు వరద నీరు చేరింది. షేర్‌మహ్మద్‌పేటలో చెరువు అలుగు పారుతుండగా, గండ్రాయి, కృష్ణానది ప్రవాహానికి చంద్రమ్మకయ్యపై వరద ఉధృతి పెరిగింది. దీంతో జగ్గయ్యపేట నుంచి ముక్త్యాల, అగ్రహారం,పోచంపల్లి, వేదాద్రి, జయంతిపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బండిపాలెం గ్రామాల్లోని వాగులు పొంగడంతో ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

10మందిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



జగ్గయ్యపేట: పాలేరు ఉధృతంగా రావడంతో పట్టణంలోని మఠం శివాలయం బాలికల హైస్కూల్ రోడ్డు, నాగమయ్యబజారు ప్రాంతాలు వరద నీరు చుట్టేయడంతో ఇళ్లన్నీ జలమయమయ్యాయి. గంటగంటకు వరద ప్రవాహం పెరుగుతుండటంతో ఆప్రాంత ప్రజలు కట్టుబట్టలతోనే బయటికి పరుగులు తీశారు. పిండప్రదానం చేసేందుకు పాలేరు ఉపనదికి వెళ్లిన పదిమంది వరద ఉధృతికి అక్కడే చిక్కుకుపోయారు.స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపకసిబ్బంది వెళ్లి నాటు పడవల ద్వారా వారిని ఒడ్డుకు చేర్చారు.

పునరావాస కేంద్రానికి తరలింపు



గనిఆత్కూరు(కంచికచర్ల) : మండలంలోని గనిఆత్కూరు గ్రామానికి చెందిన 30 కుటుంబాల రైతులురైతులు కృష్ణానది లంకభూముల్లో పంటలు సాగుచేస్తూ నివాసముంటున్నారు. కృష్ణానదికి వరద ఉధృతి పెరగడంతో రెవెన్యూ అధికారులు ఆదివారం వారిని పడవ సాయంతో గ్రామానికి చేర్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రంలో వారికి బస ఏర్పాటు చేశారు.

ఆంధ్రా-తెలంగాణకు నిలిచిన రాకపోకలు

వత్సవాయి: ఎగువన కురుస్తున్న భారీవర్షాలతో మునేరుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.వత్సవాయి మండలం లింగాల వద్ద కాజ్‌వేపై పది అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుండటంతో పోలీస్, రెవెన్యూ అధికారులు రాకపోకలు పూర్తిగా నిలిపివేసి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తుండటంతో తెలంగాణా-ఆంధ్రాకు మధ్య పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. మక్కపేట చెరువుకు గండిపడింది.


1662.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



కంచికచర్ల : నందిగామ డివిజన్ పరిధిలో 1662.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు ఆదివారం తెలిపారు. కంచికచర్లలో 248.0ఎంఎం, నందిగామలో 178.2ఎంఎం, వీరులపాడులో 244.0ఎంఎం, చందర్లపాడులో 180.2ఎంఎం, జగ్గయ్యపేటలో 260.8ఎంఎం, వత్సవాయిలో 322.2ఎంఎం, పెనుగంచిప్రోలు మండలంలో 231.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కృష్ణానదికి వరద దెబ్బకు గనిఆత్కూరులో ఇళ్లు నీటమునిగాయి. కస్తవ వాగు, నల్లవాగు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలు స్తంభించాయి. ఎస్ అమరవరంలో ఇళ్లు నీటమునిగాయి. నల్లవాగు పొంగటంతో పరిటాల అమ్రిత సాయి ఇంజినీరింగ్ కళాశాల వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. వాగులను తహసీల్దార్ జాహ్నవి, ఎంపీడీఓ కే శిల్ప, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పరిశీలించారు. వీఆర్వోలను కాపలా ఉంచారు.



కంచికచర్ల మండలం కీసర బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మునేరు



జగ్గయ్యపేట పట్టణం మఠం శివాలయం ప్రాంతంలో జలదిగ్బంధంలో ఉన్న ఇళ్లు



పెనుగంచిప్రోలు: బోసుపేటలో ఇళ్లలోకి చేరిన వరదనీరు



నందిగామ మండలం ఐతవరం హైవే వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఆర్డీవో ఎ.రవీంద్రబాబు, అధికారులు



అనిగండ్లపాడులో వృద్ధురాలిని తరలిస్తున్న గ్రామస్తులు



నందిగామ పాత ఎస్సీకాలనీలోకి చేరిన వరద నీరు



ఐతవరం వద్ద నేషనల్ హైవేపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు, ఇరువైపులా నిలిచి ఉన్న ప్రజలు, వాహనాలు

ఎటుచూసినా కన్నీరే



రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. జనజీవనం పూర్తిగా స్తంభించింది. మునేరు, పాలేరుతోపాటు వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చడంతో జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలుతోపాటు రెండు నియోజకవర్గాల్లోని పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుని రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, వరదనీటితో పంటపొలాలన్నీ నీటమునిగాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలగా, సబ్‌స్టేషన్లలోకి నీరుచేయడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో పట్టణాలు, గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. రెండురోజులుగా విద్యుత్ లేకపోవడంతో చార్జింగ్ లేక సెల్‌ఫోన్లు కూడా మూగబోయాయి. పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయాన్ని వరదనీరు చుట్టుముట్టింది. నవాబుపేట చెరువుకు గండిపడింది. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో జనం అవస్థలుపడుతున్నారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. నందిగామ మండలం ఐతవరం, మునగచర్ల వద్ద జాతీయ రహదారిపై వరదనీరు చేరడంతో హైదరాబాద్- విజయవాడ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.



జలమయమైన శ్రీతిరుపతమ్మ ఆలయ ఆవరణ



బూదవాడ ఎస్సీకాలనీలోకి చేరిన పాలేరు వరద నీరు



గండిపడిన నవాబుపేట చెరువు

ఉగ్రరూపం దాల్చిన మునేరు

పెనుగంచిప్రోలు: వాయిగుండం ప్రభావంతోపాటు కరీంనగర్, వరంగల్, ఖమ్మం ప్రాంతాల్లో ఎగువున కురుస్తున్న భారీవర్షాలకు ఆదివారం పెనుగంచిప్రోలు వద్ద మునేరు ఉగ్రరూపం దాల్చింది. కాజ్‌వే మునిగిపోయి ఐదు అడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో ఆంధ్రా-తెలంగాణ మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో మునేరు అవతల పదిగ్రామాలకు సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. వరద ప్రభావానికి మునేరు పక్కనున్న మామిడితోటలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. నవాబుపేటలోని రామన్న పంట చెరువుకు గండి పడింది. దీంతో బైపాస్ రోడ్డంతా కొట్టుకుపోవటంతోపాటు పక్కన ఉన్న పంటపొలాలు నీట మునిగాయి. ముచ్చింతాల, అనిగండ్లపాడుల్లో లోతట్టు ప్రాంతాలు జలమయంకావడంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పెనుగంచిప్రోలు ప్రధాన సెంటర్ పోలీస్‌స్టేషన్ వద్ద మోకాలు లోతు నీళ్లు ప్రవహిస్తున్నాయి. అమ్మవారి ఆలయం వద్ద దుకాణాల్లోకి వరదనీరు చేరడంతో వ్యాపారులు ఇబ్బందిపడ్డారు. ఆలయ కేశఖండనశాల పూర్తిగా నీట మునిగింది. బోసుపేటలో ఇళ్లల్లోకి భారీగా వరద నీరు చేరటంతో స్థానికులకు ఆలయ సత్రాల్లోని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎస్సీకాలనీ డొన్‌సెంటర్ వరకు ఇళ్లల్లోకి వరదనీరు చేరటంతో సామగ్రి ధాన్యం తడిసిపోయింది. గ్రామసర్పంచ్ వేల్పుల పద్మకుమారి, తహసీల్దార్ లక్ష్మీకాంతి, ఎంపీడీఓ సాయిహర్ష, ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి, అప్రమత్తం చేస్తున్నారు. మండలంలోని వాగులన్నీ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గుమ్మడిదుర్రు వద్ద వాగుపై కల్వర్టు కుంగిపోవటంతో రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి.



పెనుగంచిప్రోలు పోలీసుస్టేషన్ సెంటర్‌లో మోకాలి లోతులో నిలిచిన మునేరు వరదనీరు



మునేరు శాంతించాలని కోరుతూ పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు, భక్తులు

శాంతించాలంటూ పూజలు..

మునేరు ఉగ్రరూపం శాంతించాలంటూ ఆలయ అర్చకులు గంగమ్మ తల్లికి చీర, జాకెట్, పసుపు, కుంకుమ సమర్పించారు. చెరువుకట్ట వద్ద ఆరు, మునేరు అవతల తోటల వద్ద నాలుగు విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. దీంతో శనివారం మధ్యాహ్నాం నుంచి కరెంట్ లేక మండల ప్రజలు అల్లాడిపోతున్నారు.

కొనసాగుతున్న వరద



నందిగామ మండలం మునగచర్ల వద్ద వరద ప్రవాహం



నందిగామ మధిర రోడ్డులో వరదనీటిని పరిశీలిస్తున్న సీఐ వైవీఎల్ నాయుడు

నందిగామ టౌన్: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా నందిగామ మండలంలోని వాగులు, వంకలు, చెరువులు ఆదివారం కూడా పొంగిపొర్లుతున్నాయి. పంటలు నీటమునిగాయి. నందిగామ నుంచి అడవిరావులపాడు వెళ్లే నల్లవాగు, నందిగామ నుంచి చందాపురం వెళ్లే రహదారిలోని వాగు కూడా పొంగి పొర్లుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. కంచల గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టింది.

ఇళ్లలోకి చేరిన వరదనీరు..

నందిగామ పట్టణంలోని పలువార్డులు వరద ముంపునకు గురయ్యాయి. రెండోవార్డు పరిధిలోని కుమ్మరి బజారు, పెద్ద మసీదు, ఐస్ ఫ్యాక్టరీ, గన్నవరపు అప్పారావువీధితోపాటు బస్టాండ్ సమీపంలోని ఎస్సీ కాలనీ, మధిర రోడ్డులోని జనావాసాలలోకి వరద నీరు చేరింది.ప్రస్తుతం వరద నీటిలో అలమటిస్తున్నప్పటికీ, ప్రజాప్రతినిధుల నుంచి కనీసస్పందన కరువైందని వారు వాపోతున్నారు. గతంలో వరద సమయాల్లో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఇంటింటికీ తిరిగి అప్రమత్తం చేయటంతోపాటు వరద ముంపులో చిక్కుకున్న వారిని తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించారని గుర్తుచేసుకుంటున్నారు. వార్డుకౌన్సిలర్ తానూరి రాముకు ఫోన్‌చేసినా పట్టించుకోలేదని చెబుతున్నారు. సీఐ వైవిఎల్ నాయుడు మధిరరోడ్డులో ఇళ్లలోకి వచ్చిన వరదను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జాతీయ రహదారిపైకి వరద నీరు..

మున్నేటికి వరద ఉధృతిపెరగడంతో మండలంలోని మునగచర్ల, ఐతవరం గ్రామాల వద్ద వరద నీరు జాతీయ రహదారిపైకి ఎక్కి ప్రవహిస్తుంది. విషయం తెలుసుకున్న ఆర్డీవో రవీంద్రరావు, పోలీసులు, అధికారులు హుటాహుటిన ఐతవరం వద్దకు వెళ్లి వరద ఉధృతిని పరిశీలించారు. జాతీయ రహదారిపై రాకపోకలను నిలుపుదల చేశారు.

సురక్షితంగా బయటకు..

లింగాలపాడు-తక్కెళ్లపాడు గ్రామాల మధ్యనున్న వాగులో ఆరుగురు చిక్కుకున్నారు. ఆర్డీవో రవీంద్రరావు, పోలీసులు అక్కడకు చేరుకుని రెస్క్యూ టీం సహాయంతో పడవలలో వెళ్లి ఆరుగురిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.

పర్యాటక కేంద్రంగా మున్నేటి బ్రిడ్జి..

పల్లగిరి సమీపంలోని మున్నేటి బ్రిడ్జి వద్దకు పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుతుండటంతో పర్యాటక కేంద్రంగా మారింది. దీంతో పోలీసులు పెద్దబ్రిడ్జి వైపు ప్రజలు వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

నీటమునిగిన పంటపొలాలు



కంచికచర్ల శివసాయి క్షేత్రం ఆలయం సమీపంలో నీట మునిగిన వరి చేలు

కంచికచర్ల : మండలంలోని కీసర మున్నేరుకు భారీగా వరదనీరు చేరుతోంది. ఎగువ ప్రాంతాలైన ఖమ్మం, వరంగల్, వైరా ప్రాంతాల్లో కుండపోతగా కురిసిన వర్షానికి మున్నేరు, కట్టలేరు, వైరా ఉపనదులకు భారీగా వరదనీరు చేరుతోంది. మున్నేరుకు 2లక్షల క్యూసెక్కుల వరదనీరు వస్తుందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. మూడు రోజుల నుంచి ఎడతెరపిలేకుండా కుండపోతగా కురుస్తున్న వర్షానికి గ్రామాల్లో చెరువులన్నీ నిండుకుండలా మారాయి.

పొంచి ఉన్న ప్రమాదం...

కంచికచర్ల, గండేపల్లి, గొట్టుముక్కల, పేరకలపాడు, పరిటాల గ్రామాల్లోని చెరువులన్నీ నిండాయి. ఏ క్షణమైనా చెరువులకు గండిపడే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. భారీవర్షాలతో కూడిన వరద ఉధృతికి కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో సాగవుతున్న పత్తి, మొక్కజొన్న, వరి, మినుము, పసుపు తదితర పంటలన్నీ నీట మునిగాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జగ్గయ్యపేటను చుట్టుముట్టిన వరద



తొర్రకుంపాలెం వెళ్లే దారిలో ఇంటిని చుట్టుముట్టిన వరద నీరు

జగ్గయ్యపేట: రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతోపాటు వాగుల, వంకలు పొంగిపొర్లుతుండటంతో వరదనీరు జగ్గయ్యపేట పట్టణాన్ని చుట్టేసింది. ఆర్టీసీకాలనీ, తొర్రకుంటపాలెం, కాకనినగర్, అయ్యప్పనగర్, చింతలతోపు, ప్రాంతాల్లోని ఎర్రకాలువ, వేపలవాగు ఉప్పొంగడంతో ఇళ్లల్లోకి ఎనిమిది అడుగుల మేర వరద నీరు చేరింది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. శనివారం రాత్రి 12గంటల సమయంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కాలువలకు గండి కొట్టి వరదనీటిని సమీపంలోని ఊరచెరువుకు మళ్లించారు. పాతమున్సిపల్ సెంటర్, కోదాడరోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో వరద నీరు ఏడు అడుగుల మేర నిలవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గరికపాడు, తక్కెళ్లపాడు, అనుంచిపల్లి గ్రామాల్లో వరదనీరు ఇళ్లను చుట్టుముట్టింది.

జీవాల కాపరులను కాపాడిన పోలీసులు



విభరింతలపాడు లంకభూముల్లో చిక్కుకున్న గొర్రెలు, కాపరులను తీసుకువస్తున్న పోలీసులు

చందర్లపాడు(నందిగామ టౌన్): మండలంలోని ఆయా గ్రామాలను వరద నీరు ముంచెత్తింది. ముఖ్యంగా ముప్పాళ్ల, అడవిరావులపాడు గ్రామాల సమీపంలోని వాగు పొంగి పొర్లుతుండటంతో చందర్లపాడు-నందిగామ మండలాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ఆయా గ్రామాలకే పరిమితమయ్యారు. అంతే కాకుండా మండలంలో లంక భూముల్లో, వరద ముంపులో చిక్కుకున్న వారిని అధికారులు సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. మండలంలోని విభరింతలపాడు గ్రామసమీపంలోని లంక భూముల్లోని వరద నీటిలో నలుగురు కాపరులు, 500 జీవాలు చిక్కుకుపోయాయి. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటికే నాటు పడవల ద్వారా కష్ణానది ఒడ్డునే ఉన్న లంక పొలాలకు చేరుకుని ఇద్దరు కాపరులు, 100 జీవాలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. మిగిలిన వారిని జీవాలను కూడా అర్ధరాత్రిలోగా సురక్షితంగా తీసుకువస్తామని పోలీసులు తెలిపారు. వరద నీటి దెబ్బకు ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు నీటమునిగాయి.

ప్రమాదకరంగా వైరా-కట్టలేరు



జుజ్జూరులో ఏనుగుగడ్డ వాగుపై కొట్టుకువచ్చిన ముళ్లకంపను తొలగిస్తున్న జేసీబీ

వీరులపాడు: మూడురోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు వైరా కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వేలాది ఎకరాల పంటలు నీటిమునిగాయి. ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వెల్లంకి గ్రామంలోని ఆర్అండ్‌బీ రహదారిపైకి వరద నీరు భారీగా చేరింది. జమ్మవరం-వెల్లంకి గ్రామాల మధ్యన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వరదనీటి కారణంగా కొణతాలపల్లి, పల్లంపల్లి, వెల్లంకి, తాటిగుమ్మి, నందలూరు, పెద్దాపురం, జుజ్జూరు, నరసింహారావుపాలెం, జయంతి గ్రామాలలోని మినుము, వరి, మొక్కజొన్న పంటలు మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గూడెంమాధవరంలోని చెరువుకు వరద నీరు భారీగా చేరడంతో పలు ప్రధాన వీధుల్లోకి వరదప్రవాహం చొచ్చుకువచ్చి ఇళ్లలోకి వరద నీరు చేరింది. వైరా కట్టలేరు దాటికి వెల్లంకి ముంపునకు గురైంది. దీంతో గ్రామస్తులను అధికారులు జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించినట్లు తహసీల్దార్ రాజకిషోర్ తెలిపారు.

వాహనాలు నిలిపివేత

కంచికచర్ల : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి మున్నేరుకు గండిపడటంతో నందిగామ-కంచికచర్ల మధ్య నేషనల్ హైవే పై ఆదివారం వరదనీరు పొంగిపొర్లింది. దీంతో బస్సులు, వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రమాదకర పరిస్థితుల నేపథ్యంలో విజయవాడ నుంచి మిర్యాలగూడెం వెళ్లే తెలంగాణ ఆర్టీసీ బస్సును పోలీసులు కీసరలో నిలిపివేయగా, హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపుకు వచ్చే వాహనాలను నందిగామలో నిలుపుదల చేశారు. ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ బస్సుల్లోనే వేచి ఉన్నారు.